మా ఊరికి రోడ్డేపిచ్చింది మీరే సార్!

- మాట నిలబెట్టుకున్నారు.. చాలా సంతోషం
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన పెనుబాక ప్రజలు


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: ''మా ఊరికి రోడ్డు ఏపిచ్చం డయ్యా! అని ఎన్నోతూర్లు తెలుగుదేశం పార్టీ హయాంలో అడిగినాం.. కాయితాలూ ఇచ్చినాం.. వాళ్ల చుట్టూ తిరిగినాం.. అయినా వాళ్లు పట్టించుకోలా.. 2019లో ఎన్నికల ప్రచారానికి మీరొచ్చినారు.. మీకూ మా ఊరి సమస్యను చెప్పినాం.. గెలిపిస్తే రోడ్డేపిస్తా అని మీరు చెప్పినారు.. ఆ తర్వాత మాట నిలబెట్టుకున్నారు'' అని పెనుబాక గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతంతో కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం మండలంలోని అరవకొత్తూరు సచివాలయ పరిధిలోని పెనుబాక, కమ్మకొత్తూరులో ఎమ్మెల్యే నిర్వహించారు. దాదాపు 390 కుటుంబాలను ఆయన కలిశారు.

పెనుబాకకు ఎమ్మెల్యే ఏం మేలు చేశారంటే..

గ్రామానికి రహదారి సక్రమంగా లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత పాలకులకు ఎన్నోసార్లు సమస్యను నివేదించినా ఫలితం శూన్యం. అయితే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచాక తొట్టంబేడు మండలం గుండేలుగుంట హైస్కూల్ దగ్గర నుంచి పెనుబాక మీదుగా కమ్మకొత్తూరు వరకు సుమారు రెండు కి.మీ మేర రూ.2 కోట్ల సీసీ (రింగ్) రోడ్డు వేశారు. ప్రస్తుతం అసంపూర్తిగా మిగిలిన 500 మీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. రోడ్డు వేయించిన ఎమ్మెల్యే ఇది కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరారు. ఇక, కమ్మకొత్తూరులో ఇంటి పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరారు.

సచివాలయ నిధులతో సమస్యలు పరిష్కరిస్తా

ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు నిధులు కేటాయించిందని, సమస్యలను ఈ నిధులతో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రజని, ఎంపీటీసీ రాములమ్మ, సుబ్బారావు, రామమూర్తి, రామారావు, రమేష్‌నాయుడు, పుల్లయ్య, రమేష్, చంద్రయ్యనాయుడు, నరేంద్రనాయుడు, రాజీవ్‌గాంధీ, దేవి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకునికి ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని పెనుబాకకు చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి రామారావు తల్లి సుశీలమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆ సమయంలో ఎమ్మెలే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్థానికంగా లేకపోవడంతో శనివారం రామారావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరుణ చూపితే దేవుడి తోడు


జెరూసలెం చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: రేణిగుంట సమీపంలోని జెరూసలెం చర్చిలో శనివారం ఉపవాస దీక్ష ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. క్రైస్తవులు మానవాళి కోసం ఉపవాస దీక్షలతో ప్రార్థనలు చేయడం అభినందనీయమని, ఎదుటి వారి పట్ల కరుణ చూపితే దేవుడు అన్ని విధాలా తోడుగా ఉంటాడన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఉపవాస దీక్షలు విరమించిన వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, పాస్టర్ డేవిడ్, ఏఐసీసీ ఉపాధ్యక్షుడు సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శనివారం ముగియయడంతో స్థానిక భేరిశెట్టి కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, రాష్ట్ర వ్యాప్తంగా 1.45కోట్ల కుటుంబాలు అండగా నిలిచాయన్నారు. 1.10 కోట్ల కుటుంబాలు మిస్డ్‌కాల్స్ ద్వారా మద్దతు తెలిపాయన్నారు. నియోజవర్గంలో మా నమ్మకం నువ్వేజగన్‌కు విశేష ఆదరణ లభించిందన్నారు. అందరి సమష్టి కృషితో ఈ కార్యక్రమం విజయవంతమైందని, ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని, దీనిపై నిర్వహించిన ప్రజా సర్వేకు జనం నుంచి విశేష స్పందన లభించడమే ఉదాహరణ అని అన్నారు. గృహ యజమానుల అనుమతితోనే ఇంటి గోడలపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించామని, ప్రభుత్వ సుపరిపాలనపై అభిప్రాయాలను సేకరించామన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్లు బొప్పన సోమశేఖర్, మోహన్ మొదలి, చిన్నా, తొప్పయ్య, కోనేటి బాబు, శాస్త్రిరాజు, జయచంద్రనాయుడు, ముఖ్యనేతలు సుబ్రమణ్యం రెడ్డి, ఆనందరెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, పునిదకుమార్, శరవణ, ఎంపీ రవి, మధుసూదన్ రాజు, శ్రీనివాసులు రెడ్డి, రూబెన్, సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమించిన వ్యక్తా ప్రజాప్రతినిధి?

ప్రభుత్వ భూములు ఆక్రమించే వ్యక్తి ప్రజా ప్రతినిధి ఎలా అవుతాడని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రశ్నించారు. సత్యవేడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే.. సత్యవేడుకు చెందిన టీడీపీ నాయకుడిని ఉద్దేశించి పై వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల క్రితం సత్యవేడులో అంబేడ్కర్ భవనం నిర్మించేందుకు రూ. 2 కోట్లు మంజూరు చేశారని, దీనికిగాను తెలుగు గంగ స్థలాన్ని ఎంపిక చేస్తే ఆ టీడీపీ నాయకుడు దీనిపై కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారని, అంతే కాకుండా పలు గ్రామాల్లో బినామీల పేరుతో ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నాడని ఎమ్మెల్యే ఆరోపించారు. కోర్టు తీర్పు అనుకూలమైతే అంబేడ్కర్ భవన నిర్మాణానికి పూనుకుంటామని ప్రకటించారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానికి విరాళం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి ఓ చిట్‌ఫండ్ కంపెనీకి చెందిన జనరల్ మేనేజర్ రత్నకుమార్, కుటుంబ సభ్యులు శనివారం రూ.5లక్షల విరాళాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వారిని వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉయ్యాల సేవలో కల్యాణ వెంకన్న



నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనం అధిరోహించి ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో నిత్య పూజాది కార్యక్రమాలను అర్చకులు పూర్తి చేశారు.

'నవోదయ' పరీక్షకు 84 మంది హాజరు

సత్యవేడు: 2023–24 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన జవహర్ నవోదయ పరీక్షకు 84 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ కే.రవి తెలిపారు. శనివారం స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో ఈ పరీక్ష నిర్వహించారు. 95 మంది పరీక్షకు హాల్‌టికెట్లు పొందారు. అందులో 21మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. విద్యార్థులు ఆరవ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్మీడియెట్ వరకు చదువుకోవచ్చని ఎంఈఓ చెప్పారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ఏర్పేడు: మండలంలోని అముడూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. విద్యార్థులు భరతమాత, స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వాసుదేవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

శ్రీకాళహస్తి రూరల్: తిరువణ్ణామలైకు మే 4న ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న మధ్యాహ్నం 2.45 గంటలకు, సాయంత్రం 4.30 గంటలకు, 6.30గంటలకు బస్సులు బయల్దేరుతాయన్నారు. తిరుగు ప్రయాణంలో 5వ తేదీన తిరువణ్ణామలై నుంచి వరుసగా ఉదయం 4 గంటలకు, 5.30 గంటలకు, ఉదయం 7.30 గంటకు బయలుదేరుతాయని చెప్పారు. శ్రీకాళహస్తి నుంచి వెళ్లే తొలి సర్వీసులో రూ.425, మిగిలిన రెండు సర్వీసుల్లో రూ.350 చార్జీ అని చెప్పారు. అలాగే తిరుగు ప్రయాణంలోనూ ఇవే చార్జీలని తెలియజేశారు.

పేరెంట్స్ కమిటీ సభ్యులకు శిక్షణ


ప్రోగ్రెస్ రిపోర్టు ఇస్తున్న హెచ్చెం

శ్రీకాళహస్తి రూరల్: తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ కమిటీ సభ్యులకు సామాజిక తనిఖీలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఏడాదిపాటు వివిధ పరీక్షల్లో సాధించిన మార్కుల జాబితాను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి పథకాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, మునికృష్ణయ్య, కుప్పయ్య, మోహన్‌బాబు, భాస్కర్, పగడాల సుబ్రమణ్యం, కుమార్, జాన్ అబ్రహాం, సుజాత, ఫ్లోరెన్స్, చంద్రకుమారి, బబిత బేగం, తేజ, సీఆర్‌పీ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్రీన్ కోర్ సర్టిఫికెట్లు

నారాయణవనం: జాతీయ స్థాయిలో గ్రీన్ కోర్(ఎన్‌జీసి) స్కూల్‌గా గుర్తింపు కృషి చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసినట్లు బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శశికళ, ఎన్‌జీసీ కో–ఆర్డినేటర్ శ్యామలత తెలిపారు. వారు మాట్లాడుతూ ఆరు అంశాలలో పాఠశాలకు జాతీయ స్థాయిలో ఎన్‌జీసీ గుర్తింపు లభించిందన్నారు. గత నెలలో న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో శ్యామలత కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. పాఠశాలను గ్రీన్ కోర్ గుర్తింపు కోసం పాల్గొన్న 60 మంది ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను శనివారం వెబ్‌సైట్‌లో ఉంచారని శశికళ తెలిపారు. వాటిని డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేశామని అన్నారు. కాకినాడలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న 14 మంది విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

నంది వాహనంపై అగస్త్యేశ్వరుడు విహారం


నంది వాహనంపై అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సాలలో శనివారం రాత్రి నందివాహనంపై అగస్త్యేశ్వరుడు మేళతాళాలు, కోలాటాల మధ్య విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం నిత్యపూజార్చన కార్యక్రమాల అనంతరం 10.30 గంటలకు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, జమేదార్ విజయకుమార్, భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో ఆదివారం రాత్రి అగస్త్యేశ్వరస్వామి గజవాహనంపై ఊరేగనున్నారు.

ఘనంగా చిన్నకొట్టాయి ఉత్సవం


అభిషేకం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం చిన్నకొట్టాయి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పగడ చెట్టు వద్ద నిర్వహించాల్సిన పూజలను వర్షం కారణంగా ఆలయ అలంకార మండపంలో నిర్వహించారు. మొదట స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాల అనంతరం విశేషంగా అలంకరించారు. చతుర్వేద పారాయణం, మంత్రపుష్పం, నైవేద్యం, దీపారాధన, హారతి నిర్వహించారు. అనంతరం ఆలయంలోనే స్వామి అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఈఓ సాగర్‌బాబు, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

పిచ్చాటూరు: మండలంలోని సిద్దిరాజుకండ్రిగలో శ్రీ లక్ష్మీగణపతి హనుమతీశ్వరాలయ మహా కుంభాభిషేకంలో భాగంగా చివరి రోజైన శనివారం రాత్రి శ్రీవల్లీ దేవసేన సుబ్రమణ్యస్వామిల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. సుబ్రహ్మణేశ్వర స్వామిని వరునిగా, శ్రీవల్లి, దేవసేనలను వధువులు అలంకరించి భక్తజన సందోహం నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. దీంతో శ్రీ సోమనాథేశ్వరాలయ కుంభాభిషేకం పరిసమాప్తమైంది.

'స్వప్రయోజనాలకే బాబు వెంపర్లాట'

నారాయణవనం: రోజు రోజుకూ ప్రజాదరణ కోల్పోతున్న తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం చంద్రబాబు ఎన్టీ రామారావు జపం చేస్తున్నాడని వైఎస్సార్ సీపీ నాయకులు అపహాస్యం చేశారు. శనివారం మీడియాతో వారు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ గాలికి కొట్టుకుపోతున్న టీడీపీని అధికారంలోకి తేవడానికి శతజయంతి ఉత్సవాల ముసుగులో పావులను కదుపుతున్నారని అన్నారు. శత జయంతి వేడుకలకు తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌ను మాత్రమే ప్రత్యేకంగా ఆహ్వానించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి సుదర్శనరెడ్డి, ఎంపీపీ దివాకర్, మండల సచివాలయ కన్వీనర్ కోనేటి బాబు, వైఎస్ ఎంపీపీ శివశంకర్, సర్పంచ్‌లు సాయిరవి, రామ్మూర్తి, సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సుబ్బమ్మ, చెంచమ్మ, పార్టీ నాయకులు రాజారెడ్డి, బాలాజిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధిలో గిరిజనులు భేష్!


కృష్ణాపురం గిరిజనకాలనీలో స్వయం ఉపాధి సభ్యులతో మాట్లాడుతున్న మహ్మద్ ఖాన్

వరదయ్యపాళెం: స్వయం ఉపాధి వైపు గిరిజనులు శ్రద్ధ కనబరచడం అభినందనీయమని ఎన్ఐఆర్డీ సీనియర్ కన్సల్టెంట్ మహ్మద్ ఖాన్ అన్నారు. లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాంబాకం గిరిజన కాలనీ, కృష్ణాపురం, సంతోష్‌పురం కాలనీల్లో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కేంద్రాలను శనివారం హైదరాబాద్‌కు చెందిన ఎన్ఐఆర్డీ, ఆర్‌టీపీ, పంచాయతీరాజ్ విభాగాలకు చెందిన ప్రతినిధుల బృందం సందర్శించింది. మట్టి ఇటుకల తయారీ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ ఉపాధి పొందుతున్న గిరిజనులతో వారు మాట్లాడారు. అనంతరం కాంబాకంలో సామాజిక భవనంలో స్థానికులతో సమావేశమయ్యారు. లోకా ఫౌండేషన్ గిరిజనుల కోసం నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కేంద్రాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. వారి వెంట లోకా ఫౌండేషన్ ప్రతినిధి ఆచార్య ఆనందగిరిజీ ఉన్నారు.

పళ్లికొండేశ్వరునికి రూ.2.85లక్షల ఆదాయం

పిచ్చాటూరు: సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరాలయ హుండీ లెక్కింపు ద్వారా 2,85,465 రూపాయలు సమకూరినట్లు తిరుపతి దేవదాయ శాఖ అధికారి రామకృష్ణా రెడ్డి తెలిపారు. 38 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయం లెక్కించినట్లు ఆయన చెప్పారు. సాయంత్రం ఆలయ సిబ్బందికి చైర్మన్, ఈఓ యూనిఫామ్ దుస్తులు పంపిణీ చేశారు.

శ్రీపళ్లికొండేశ్వరుని సేవలో సుమన్ కుమార్

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీ మంగళాదేవి సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామిని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రా రెడ్డి, బోర్డు సభ్యులు సుమన్ దంపతులకు ఆలయ మర్యాదలు చేశారు.

సర్పంచ్‌కు గౌరవ డాక్టరేట్



రేణిగుంట: రేణిగుంట మండలం గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్ శనివారం బెంగుళూరు హోసూర్‌లోని ఆసియా అంతర్జాతీయ పరిశోధన విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ తరపున ఆయన 20ఏళ్లుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

విద్యార్థులకు ఆటవస్తువుల వితరణ


ఆటవస్తువులు అందజేస్తున్న ఉదయ్ కుమార్

పిచ్చాటూరు: నాగలాపురం మండలం ఎస్ఎస్ పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఉదయకుమార్ ఆటవస్తువులు వితరణ చేశారు. హెచ్‌ఎం ఉదయచంద్రిక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శేఖర్, పీఎంసీ చైర్మన్ రఘురామయ్య, టీచర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభయక్షేత్రానికి వితరణ


నిత్యావసర సరకులను అందజేస్తున్న చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం

రేణిగుంట: స్థానిక బిస్మిల్లానగర్‌లోని అభయక్షేత్రంలో చదలవాడ వెంకట రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం విద్యార్థులు శనివారం నిత్యావసర వస్తువులు వితరణగా అందజేశారు. చదలవాడ విద్యాసంస్థల అధినేత చదలవాడ కృష్ణమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వితరణ చేసినట్లు ఈసీఈ విభాగాధిపతి మురళీమోహన్‌బాబు అన్నారు. అనాథలు, అభాగ్యులు, దివ్యాంగులను చేరదీసి సేవలందిస్తున్న అభయక్షేత్రం నిర్వాహకురాలు తస్లీమాను ఆయన అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్ పటేల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంతో విద్యుత్ అంతరాయం


పిచ్చాటూరులో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో శనివారం మధ్యాహ్నం పిడుగులతో కూడిన వాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మెయిన్ సప్‌లైల్లో నాలుగు చోట్ల ఇబ్బంది తలెత్తడం వల్ల విద్యుత్ ఈ సమస్య తలెత్తినట్లు అధికారులు తెలిపారు. వర్షంతో మామిడి పంట తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు మామిడి రైతులు వాపోతున్నారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి.

కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉజ్వల భవిష్యత్తు


సర్టిఫికెట్లను అందజేస్తున్న రెడ్డెయ్య

ఏర్పేడు: కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు రెడ్డెయ్య అన్నారు. శనివారం మండలంలోని కందాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు 90 మంది విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కన్వీనర్ సుబోస్, ఉపాధ్యాయులు భాస్కర్, చంద్ర, కృష్ణ దేవరాయ, విద్యార్థులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్నా!


మోటార్ సైకిళ్ల ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు

- మోటార్ సైకిళ్ల ర్యాలీతో హోరెత్తిన శ్రీకాళహస్తి


వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: మా నమ్మకం నువ్వే జగనన్నా..అని ప్రజలంతా ముక్తకంఠంతో నినదిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు మోటార్ సైకిళ్ల ర్యాలీతో హోరెత్తించారు. ×జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్* కార్యక్రమంతో నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం..అలాగే, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించడం విదితమే. శనివారం ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వానికి మంచి మద్దతు లభించిందని హర్షం వ్యక్తం చేస్తూ శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం పట్టణ వీధుల గుండా ర్యాలీ నిర్వహించి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఆకర్ష్‌రెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పలువురు నాయకులు మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో సంక్షేమం పరుగులు తీస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం తథ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు పసల సుమతి, మున్నా, జయశ్యామ్, చింతామణి పాండు, నాని, వెంకీ, నగేష్; కందాటి ఈశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, గోరా, ఫజల్, సాగీరాబీ, సునీతాసింగ్, షర్మిల ఠాగూర్, ఇందిర, కొల్లూరు హరినాయుడు, కొన్నలి రమేష్, గోపిగౌడ్, మధురెడ్డి, దాము, ఖాదర్‌బాషా, శంకర్, అంకయ్య, మురళియాదవ్, యుగంధర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలో కొత్తవీరాపురానికి చెందిన మద్దూరు బండి శ్రీరాములు(57) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు పార్టీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియలకు రూ.10 వేలు అందజేశారు.

భక్తుడికి పర్సు అప్పగింత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనానికి తెలంగాణకు చెందిన సూరుగురి ఆనంద్‌రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చారు. ఆలయంలో పర్సును పోగొట్టుకున్నారు. సిబ్బంది దృష్టికి ఆ పర్సు రావడంతో దానిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు అప్పగించారు. ఆయన మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా భక్తులను పిలిపించి అందజేశారు.